హైదరాబాద్‌కు ఉప రాష్ట్రపతి రాక

- స్వాగతం పలికిన గవర్నర్, సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ ఆదివారం హైదరాబాద్ విచ్చేశారు. ఆయనకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. రాధాకృష్ణన్‌కు స్వాగతం పలికిన వారిలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మేయర్ గద్వాల విజయ లక్ష్మి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, జిల్లా అదనపు కలెక్టర్ జి.ముకుందరెడ్డి, నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి , పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఏర్పాటు చేసిన తేనీటి విందు కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

19న 'కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి ఏరిన రచనలు' పుస్తకావిష్కరణ సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి ఏరిన రచనలు' పుస్తకావిష్కరణ సభను నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె గోవర్ధన్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని మార్క్స్‌భవన్‌లో ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చంద్ర పుల్లారెడ్డి విప్లవ జీవితాన్ని ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త కూడా అధ్యయనం చేయాలని సూచించారు. పుల్లారెడ్డికి ముఖ్యమైన రచనల నుంచి కొన్ని భాగాలను ఎంపిక చేసి తెలుగు, ఇంగ్లీష్‌లో రెండు పుస్తకాలను తీసుకురాబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఒడబ్ల్యు జాతీయ నాయకులు జి ఝాన్సీ, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం నవీన్, రాష్ట్ర నాయకులు టి శ్యామ్, అసిఫ్, కె ఝాన్సీ, అరుణోదయ నాయకులు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు కఠిన చట్టాలు రావాలి

- సామాజిక వ్యవస్థలో మార్పు జరగాలి
- ఐద్వా ఆలిండియా జాయింట్ సెక్రటరీ తపసీ ప్రహరాజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో మహిళల భద్రతకు కఠిన చట్టాలు రావాలని, దాంతో పాటు సామాజిక వ్యవస్థలో మార్పు జరగాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆలిండియా జాయింట్ సెక్రటరీ తపసీ ప్రహరాజ్ అన్నారు. ఐద్వా ఆలిండియా మహాసభ సెమినార్‌లో పాల్గొనేందుకు ఆదివారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు వచ్చిన ఆమెకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరి 25 నుండి 28 వరకు హైదరాబాద్‌లో ఆలిండియా మహాసభలు జరగనున్నాయని, ఈ మహాసభలు తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భారతీయ సమాజంలో మహిళలపై దాడులు ఆగాలంటే కఠిన చట్టాలతో పాటు సామాజిక వ్యవస్థలో కూడా మార్పు రావాల్సిన అవసరముందన్నారు. మేజర్లు ఇష్టపడి తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకుంటే, ఆ హక్కును కాలరాస్తూ కుల దురహంకార హత్యలు జరుగుతున్నాయని అన్నారు. ఇందుకు నిదర్శనమే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం గెర్రె గ్రామంలో ఇటీవల జరిగిన ఘటన అని గుర్తు చేశారు. దేశంలో ఇలాంటి సంఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. ఢిల్లీలో నిర్భయ ఘటన, జమ్ము కాశ్మీర్‌లోని ఖథువాలో ఎనిమిదేండ్ల బాలికపై జరిగిన ఉదంతం, మణిపూర్‌లో మహిళలపై దాడులు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పైగా నిందితుల పక్షానే కేంద్ర ప్రభుత్వం నిలవడం సిగ్గుచేటని మండిపడ్డారు. మహిళలను నాలుగు గోడలకే పరిమితం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తిరోగమన విధానాలను ముందుకు తెస్తోందన్నారు. మహిళలు ఇంట్లోనే ఉండాలి పిల్లలను పెంచాలనే రీతిలో కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉంటున్నాయన్నారు. మహిళలు ప్రస్తుతం తమను తాము రక్షించుకోవడం కోసం వీధుల్లోకి వచ్చి పోరాటాలు చేస్తున్నారన్నారు. ఐద్వా సెంట్రల్ కమిటీ సభ్యురాలు ఆశాలత మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగే ఆలిండియా మహాసభల విజయవంతం కోసం ఇంటింటి ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి దుర్గం అనిత, కోశాధికారి షాహిన్ పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలపై చైతన్యం

- రచనలకు అద్భుత స్పందన
- తదుపరి కార్యాచరణపై మంత్రి జూపల్లి సమీక్ష
- పారదర్శకంగా చేయాలని ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాజిక రుగ్మతలను రూపుమాపి, ప్రజల్లో పరివర్తన తీసుకొచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 'ప్రభాత భేరి' పేరిట చేపట్టిన వినూత్న ప్రయత్నానికి అపూర్వ స్పందన లభించింది. సామాజిక రుగ్మతలపై ప్రజల్లో చైతన్యం, అవగాహన పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కవులు, రచయితలు, కళాకారుల నుంచి కోరిన కథలు, కవిత్వం, పాటలు, సృజనాత్మక రచనలకు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమం పురోగతి, అందిన ఎంట్రీల స్థాయి, తదుపరి చర్యలపై పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం హైదరాబాద్ బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్రం నలుమూలల నుంచి కవులు, రచయితలు, కళాకారుల నుంచి వందల సంఖ్యలో రచనలు పంపినట్టు అధికారులు మంత్రికి వివరించారు. కథలు, కవితలు, పాటలు, హరికథ, బుర్రకథలకు సంబంధించిన పలు రచనలు అందినట్టు చెప్పారు. ఈ సృజనాత్మక స్పందనపై మంత్రి జూపల్లి హర్షం వ్యక్తం చేశారు. ప్రజల్లో చైతన్యాన్ని మేల్కొలిపే శక్తి కవులు, కళాకారుల్లో ఉంది. వచ్చిన రచనల్లో అత్యుత్తమమైన, ప్రభావవంతమైన, సందేశాత్మక రచనలను మూల్యాంకనం చేసే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి జూపల్లి అధికారులను ఆదేశించారు. సంక్రాంతిలోగా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపికైన రచనలతో ఒక ప్రత్యేక వివిధ కళా రూపాల్లో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి తదుపరి కార్యచరణను రూపొందించాలని సూచించారు. సమాజహితం కోసం సేవ చేస్తున్న ప్రతి రచయితను, కళాకారుడిని ప్రభుత్వం గౌరవించేందుకు ఇప్పటికే చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ట్రాప్‌లో కవిత : వివేకానంద

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ట్రాప్‌లో పడిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ సర్కార్ హయాంలో పదేండ్లు ఎంపి, ఎమ్మెల్సీ వంటి పదవుల్లో ఉన్నప్పుడు లేని సమస్యలు ఇప్పుడెందుకు వచ్చాయో చెప్పాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేదని చెప్పిన కవిత.. ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత బిఆర్ఎస్ పార్టీపై, మాజీ మంత్రులపై ఆరోపణలు చేయడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఆమె ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. కొత్త పార్టీ ఏర్పాటు కవిత ఇష్టమని వ్యాఖ్యానించారు.

నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

- తెల్లారుజామున క్యాబినెట్ అజెండా
- ఎందుకింత గోప్యతంటూ విమర్శలు
- స్థానిక ఎన్నికలు, విజన్ డాక్యుమెంట్, ప్రజా ప్రభుత్వ ద్వితీయ వార్షికోత్సవాలే కీలకాంశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏ సంస్థకైనా, ఏ వ్యవస్థకైనా 'సమావేశపు అజెండా' అనేది కీలకం. ఆ మీటింగుకు సంబంధించిన షెడ్యూల్, దాని అజెండాలోని ముఖ్యాంశాల సమాచారం కొద్ది రోజుల ముందుగా ఇవ్వటం నిర్వాహకుల ప్రాథమిక విధి. తద్వారా మీటింగులో పాల్గొనే సభ్యులు అజెండాలోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అధ్యయనం చేయటమనేది ఇక్కడ ముఖ్యోద్దేశం. ఇది సమావేశానికి పరిపూర్ణతను చేకూరుస్తుంది. కానీ రాష్ట్ర మంత్రివర్గ సమావేశపు అజెండాను మాత్రం అందుకు భిన్నంగా పంపుతున్నారని సమాచారం. క్యాబినెట్ ముందు రోజు వరకూ అజెండా పంపకుండా. ఏ రోజైతే మంత్రివర్గపు భేటీ ఉంటుందో.. అదే రోజు తెల్లారుజామున మూడు నాలుగు గంటలకు దాన్ని పంపుతున్నారని తెలిసింది. అది కూడా రెండొందల నుంచి మూడొందల పేజీలతో కూడిన ప్రతిని పంపుతున్నారు. దీనివల్ల ఇటు మంత్రులు, అటు ఉన్నతాధికారులు కూడా దాన్ని ఏమాత్రం చదవలేకపోతున్నారని వినికిడి. అయినా అజెండా విషయంలో మంత్రులు, ఉన్నతాధికారుల వద్ద కూడా ఇంత గోప్యత ఎందుకనే విమర్శలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి. దీన్ని ప్రభుత్వం సవరించుకోవాలనే సూచనలు కూడా వస్తున్నాయి. సోమవారం నిర్వహించబోయే క్యాబినెట్ సమావేశపు అజెండా సైతం ఆదివారం రాత్రి వరకూ మంత్రులు, అధికారులకు చేరకపోవటం గమనార్హం.

కాగా సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రివర్గం భేటీ కానుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో... ఇదే ఊపులో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. అందువల్ల క్యాబినెట్‌లో ఈ అంశం కీలకం కానుంది. లోకల్ ఫైట్‌కు సంబంధించి ఏయే జిల్లాల్లో పరిస్థితి ఎలా ఉంది? ఎక్కడెక్కడ గెలుపు అవకాశాలు ఎలా ఉన్నాయి? బిసి రిజర్వేషన్లు, దానిపై హైకోర్టులో కేసు, న్యాయస్థానం వెలువరించే తీర్పునుబట్టి ఎలాంటి వైఖరి తీసుకోవాలి? అనే అంశాలపై సిఎం, మంత్రులు ప్రధానంగా చర్చించనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి డిసెంబరు ఏడు నాటికి రెండేళ్లు పూర్తి కావొస్తున్న నేపథ్యంలో...'ప్రజా పాలన-ద్వితీయ వార్షికోత్సవాల'ను నిర్వహణలు, సభలు, సమావేశాలు, సదస్సుల ఏర్పాట్లు తదితరాంశాలపై ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేయనున్నారు. దీనికి కొనసాగింపుగా 'తెలంగాణ రైజింగ్-2047, విజన్ డాక్యుమెంట్' రూపకల్పన, అందుకోసం తీసుకోవాల్సిన ప్రాతిపదికలు, ఆ డాక్యుమెంట్ ఆధారంగా చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళిక మొదలగు అంశాలపై మంత్రివర్గం చర్చించనుందని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

పథకాలపై సమీక్ష...

ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేకపోతోందంటూ ప్రతిపక్షాలు విమర్శించినప్పటికీ జూబ్లీహిల్స్‌లో అవేమీ పని చేయలేదని ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్నారు. తమ రెండేండ్ల పాలనను ఓటు ద్వారా ప్రజలు ఆదరించారని వారు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల రానున్న రోజుల్లో ఇవే పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేయటం, ఆరు గ్యారెంటీల్లో మిగతా వాటిపై దృష్టి సారించటం, ఆ మేరకు ఆదాయ వనరుల సమీకరణ, అందుకోసం ఎలాంటి నిర్ణయాలు, చర్యలు తీసుకోవాలి... ఇలాంటి ముఖ్యమైన విషయాలపై క్యాబినెట్‌లో చర్చించనున్నారని సమాచారం.

పేదల సొంతింటి కల 'ఇందిరమ్మ'తో సాకారం

- ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదల సొంతింటి కల ఇందిరమ్మ పథకం ద్వారా సాకారమవుతోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11, 22, 23 వార్డుల పరిధిలో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్లను మంత్రి పొంగులేటి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేదల కుటుంబాల్లో ఆనందాన్ని చూస్తున్నామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల పాటు డబుల్ ఇండ్ల పేరుతో పేదలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను రెండు కళ్లలా భావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసుకుంటూ వస్తోందన్నారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు రాలేదని అధైర్య పడొద్దన్నారు.

అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ఇందిరమ్మ ఇంటిని కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, ఎఎంసి చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, శివా సత్యనారాయణమూర్తి (వేణు), నాయకులు దొడ్డా శ్రీనివాసరావు, మొహమ్మద్ కమల్‌పాషా, భీమిరెడ్డి సుబ్బారెడ్డి, మందపాటి ముత్తారెడ్డి, పింగుల సామేలు, దూదిపాల రాంబాబు, గొర్లమారి రామ్మోహనరెడ్డి, కంటె నాగలక్ష్మి పాల్గొన్నారు.

సామినేని హంతకును తేల్చేవరకూ పోరాటం

- 19న కాంగ్రెస్, బిజెపియేతర పక్షాలతో రౌండ్‌టేబుల్
- పోలీసు కార్యాలయాల ముట్టడికి కార్యాచరణ
- డిప్యూటీ సిఎం భట్టి ఒత్తిడి మేరకే విచారణలో జాప్యం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం రాష్ట్ర నాయకులు, చింతకాని మండలం పాతర్లపాడు మాజీ సర్పంచ్ సామినేని రామారావు హత్య జరిగి నేటికీ 17 రోజులు అవుతున్నా దోషులను తేల్చటంలో పోలీసుశాఖ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఉద్యమ కార్యాచరణ చేపడుతామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు తెలిపారు. 19వ తేదీన కాంగ్రెస్, బిజెపేతర అఖిలపక్షాలతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. దీనికి ప్రజాస్వామ్య, ప్రజాతంత్రవాదులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమస్యను వదిలే ప్రసక్తే లేదని, నేరస్తులను అరెస్టు చేసే వరకూ ఉద్యమిస్తామని హెచ్చరించారు. అధికార పార్టీ ఒత్తిడి, ముఖ్యంగా మధిర నియోజకవర్గ శాసనసభ్యులు, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఒత్తిడి మేరకే విచారణలో జాప్యం జరుగుతోందని అన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోతినేని మాట్లాడారు. సామినేని హత్య కేసు విచారణ పక్కదోవ పట్టేలా సాగుతోందన్నారు. అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గి విచారణను ఇలాగే జాప్యం చేస్తే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అఖిలపక్షాలు, ప్రజాస్వామ్యవాదులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లను ముట్టడిస్తామని ప్రకటించారు.

కనిపించే నేరస్తులను వదిలి కానరాని వారికోసం అన్వేషణ

సామినేని కేసు విషయంలో పోలీసు విచారణ కనిపించే నేరస్తులను వదిలి కానరాని వారికోసం అన్వేషణలా సాగుతోందని పోతినేని అన్నారు. హత్య జరిగిన రోజే నేరస్తులు ఫలానా వాళ్లని రామారావు సతీమణి స్వరాజ్యం ఫిర్యాదు చేశారని తెలిపారు. గ్రామానికి చెందిన ఐదుగురు ఈ హత్యా నిందితుల్లో ఉన్నారని ఆమె పిటిషన్ ఇచ్చినా పోలీసులు దానిని పూర్తిగా పక్కన పెట్టేసి.. రామారావుకు కుటుంబ సమస్యలు ఏమున్నాయి?, ఆయనకు పార్టీలో అంతర్గత సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఆర్థిక సమస్యలు ఏమున్నాయి?... రామారావు కుమారులు, కుమార్తె, మనవళ్లు, మనవరాళ్లు వాళ్లు చదువుకున్న కాలేజీలు, ఆ కళాశాలల్లో వారికి శత్రువులు ఎవరున్నారు? అని పోలీసులు విచారిస్తుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. నేరస్తులు ఫలానా వాళ్లూ అంటే వాళ్లను విచారించకపోగా, హత్య జరిగిన రోజు ఆ గ్రామ, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ప్రెస్‌మీట్‌లు పెట్టి ఏ తప్పుడు ఆరోపణలైతే చేశారో ఆ ప్రచారాలకు అనుగుణంగా పోలీసు విచారణ సాగుతోందన్నారు. ఇదీ రాజకీయ హత్య అంటే పోలీసు కమిషనర్ ఏమాత్రం సహించలేని పరిస్థితి కనిపిస్తోందన్నారు. హత్య వెనుక పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ ఉందని ఎవరంటే...వారిపైనే పోలీసు కేసులు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించటం సరైన పద్ధతి కాదన్నారు. తాము చేసిన నేరాన్ని తప్పించుకోవటం కోసం చేసే ప్రచారాన్ని నమ్మి విచారణ సాగిస్తే దోషులను ఎప్పటికీ పట్టుకోలేరని తాము సిపికి సూచించినట్లు తెలిపారు. పాతర్లపాడు గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా పెడదామని భావించే వ్యక్తిని, తమ పార్టీ పూర్తికాలం కార్యకర్తను, తమ పార్టీకి చెందిన రైతుసంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేశ్‌ను విచారణకు రమ్మని మధిర సిఐ ఫోన్ చేయటాన్ని బట్టి విచారణ ఎంత పక్కదోవ పట్టేలా వెళ్తుందో అర్థం చేసుకోవచ్చని విశ్లేషించారు. అందుకే సమస్యను ఇలా వదలకుండా నేరస్తులను అరెస్ట్ చేసే దాకా పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమించాలని నిర్ణయించుకున్నామని సుదర్శన్‌రావు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేశ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, రాష్ట్ర సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు పాల్గన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో నరసాపురం

ఓ.యస్.నెం.151 ఆఫ్ 2024

బిట్వీన్ :
నంధ్యాల సోమేశ్వరరావు ...వాది
మరియు
చేగొండి కృష్ణవేణి వగైరా ...ప్రతివాదు
1వ ప్రతివాది చేగొండి కృష్ణవేణి, భర్త లేటు జనార్ధనరావు, 65 సం.లు, స్త్రీ
2వ ప్రతివాది చేగొండి వేంకట నాయుడు, తండ్రి లేటు జనార్ధనరావు, 45 సం.లు, పు
3వ ప్రతివాది చేగొండి శ్రీరామ్, తండ్రి లేటు జనార్ధనరావు, 42 సం.లు, పు
4వ ప్రతివాది సత్యకళ, భర్త పేరు తెలియదు, తండ్రి లేటు జనార్ధనరావు, 48 సం. స్త్రీ,

పై నలుగురు ప్రతివాదుల అడ్రస్ ప్లాట్ నెం.101, కిరణమ్మయి రెసిడెన్సీ, ఎమ్.ఐ.జి-853, ఫేజ్-2, కె.పి.హెచ్.బి కాలనీ, హైదరాబాదు -500 072, కూకట్‌పల్లి కోర్టు.

పై దావాను మీలో 1వ ప్రతివాది భర్త, 2 నుంచి 4 ప్రతివాదుల తండ్రియైన లేటు జనార్ధనరావుగారు వాది వద్ద చేసిన అప్పు తాలూకు సొమ్ము రూ.5,50,667.00 లు వసూలు కొరకు వారసులైన మీనలుగురిపై దాఖలు చేసినారు. సదరు దావాలో మీపై సమన్లు ఎన్నిసార్లు తీసుకున్నను అవి అమలు జరుగనందున, పైకోర్టు వారి ఆదేశముపై పైదావాలో మీపై సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తీసుకోవడమైనది.

సదరు దావా మీ హాజరుకై ది.15.12.2025కు వాయిదా అయియున్నది. కావున మీరు స్వయముగా గానీ ప్లీడరు గారి ద్వారా గానీ ఆరోజు ఉదయం 10.30 ని.ల లగాయితు పైకోర్టుకు హాజరయి మీ వాదనలను కోర్టు వారికి తెలుపుకోవలసినదిగా తెలియజేయడమైనది. లేని ఎడల మీ పరోక్షములో తీర్పు చెప్పబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

నరసాపురం **వంగల వేంకటాచార్యులు**
తేది.14.11.2025 కోటిపల్లి వారి వీధి

'జల్‌జీవన్' గ్రాంట్లు కేంద్రం నిలిపివేత

- 8 నెలలుగా వేతనాలు లేని 'మిషన్ భగీరథ' సిబ్బంది
- శాఖకు అవార్డులు వచ్చినా తీరని ఉద్యోగుల కష్టాలు
- కనీస వేతనాలు అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలంటున్న సిబ్బంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జల్ జీవన్ మిషన్ (జెజెఎం) గ్రాంట్లను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడంతో రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకంలో ఔట్‌సోర్సింగ్‌పై నియమితులైన 352 మంది సిబ్బందికి 8 నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. దాంతో ఆ సిబ్బంది తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నీటి నాణ్యతా విషయంలో బాగా పనిచేసినందుకు తెలంగాణ రాష్ట్రానికి అవార్డు వచ్చింది. ఇంత చేసినా సిబ్బందికి మాత్రం వేతనాలు ఇవ్వకుండా కేంద్రం తాత్సారం చేస్తోంది.

గతంలో నేషనల్ రూరల్ డ్రింకింగ్ వాటర్ ప్రోగ్రామ్ (ఎన్ఆర్‌డిడబ్ల్యుపి) కింద గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, వంటలు, ఇతర సౌకర్యార్థం సురక్షితమైన నీటిని అందించడానికి ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2009లో ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద అన్ని రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తాగునీటితోపాటు ప్రతి మనిషికి అవసరమైన 55ఎల్‌పీసీడీల నీటిని అందించాలని నిర్దేశించింది. 2019లో ఈ పథకం స్థానంలో కేంద్రం జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద వచ్చే గ్రాంట్లతో మిషన్ భగీరథ పథకం కింద ఏర్పాటు చేసిన తాగునీటి పరీక్షా కేంద్రాల్లో ఔట్‌సోర్సింగ్‌పై వివిధ విభాగాల్లో పనిచేసే 352 మందికి వేతనాలు ఇచ్చేవారు. తాజాగా కేంద్రం జేజేఎం మిషన్ గ్రాంట్‌ను రాష్ట్రానికి నిలిపివేయడంతో సిబ్బందికి వేతనాలు బంద్ అయ్యాయి. దాంతో ఉద్యోగుల జీవనం కష్టంగా మారింది.

మిషన్ భగీరథ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 150 వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటున్నాయి. వీటిలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో మొత్తం 352మంది ఔట్‌సోర్సింగ్‌పై పనిచేస్తున్నారు. రాష్ట్రంలో డివిజన్‌స్థాయిలో, జిల్లాస్థాయిలో, సబ్ డివిజన్‌స్థాయిలో, రాష్ట్రస్థాయిలో పనిచేస్తున్నారు. 76 మంది చొప్పున కెమిస్టులు, మైక్రో బయాలజిస్టులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, హెల్పర్లు, 20 మంది ల్యాబ్ అసిస్టెంట్లు, 20 మంది డేటాఎంట్రీ ఆపరేటర్లు, 9 మంది జిల్లా కన్సల్టెంట్లుగా పనిచేస్తున్నారు. 10-20 ఏండ్లుగా ఈ సిబ్బంది వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. వీరంతా ప్రీ మాన్‌సూన్, పోస్ట్ మాన్‌సూన్‌లలో ప్రతినెలా 250 నీటి నమూనాలతో రసాయన పరీక్షలను నిర్వహిస్తారు. 50నమూనాలను మైక్రో బయాలజిస్టులు పరీక్షిస్తారు. ఏడాదికి మొత్తం 3,600 నీటి నమూనాలను సేకరించి భౌతిక, రసాయనిక సూక్ష్మజీవ సంబంధమైన 13 పరీక్షలను పరీక్షించి పరీక్షా ఫలితాలను ప్రతిరోజు నిర్వహిస్తారు. నెలకు 300 నమూనాలకు సంబంధించిన డేటాను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తుంటారు. అంతేకాకుండా, శుద్ధనీటి నమూనాలను రీచెక్ చేస్తూ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల నీటి నమూనాలను ఆలం క్వాలిటీ టెస్టులను అదనపు బాధ్యతగా నిర్వహిస్తున్నారు.

పెండింగ్‌లో రూ.5 కోట్ల వేతనాలు

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్‌పై నియమితులైన 352 మంది సిబ్బందికి 2025 ఏప్రిల్ నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జల్‌జీవన్ మిషన్ గ్రాంట్లను రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడంతో వీరి వేతనాలూ నిలిచిపోయాయి. 8 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం పట్ల సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. కెమిస్టులు, మైక్రో బయాలజిస్టులకు నెలకు రూ.20 వేలు, ల్యాబ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.19 వేలు, హెల్పర్లకు రూ.15 వేల వేతనాన్ని ఇస్తున్నారు.

తీవ్ర పనిభారం

ఈ సిబ్బంది చేస్తున్న పనులకు అదనంగా పలు పనులను అప్పగించారు. మిషన్ భగీరథ నీటి వాడకంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేలా పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులకు అవగాహన కలిగిస్తున్నారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు, అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆశా వర్కర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షకులకు, గ్రామ ప్రజలకు సైతం శుద్ధ నీటిపై అవగాహన పెంచుతున్నారు. వరదల సమయంలో అదనపు విధులు, శ్రీరామ నవమి, మేడారం తదితర జాతరల్లో అదనంగా పని చేయాల్సి ఉంటుంది.

FORM NO. 14
[See Regulation 33(2)]
By Regd. A/D, Dasti failing which by Publication.

OFFICE OF THE RECOVERY OFFICER - I/II
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 2)
1st Floor, Triveni Complex Abids, Hyderabad 500001

DEMAND NOTICE

NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.

RC/303/2019 **06-11-2025**

Union Bank of India (Earlier Corporation Bank)
Versus
New Dream World Mens Wear& Others

To
(CD 1) New Dream World Mens Wear, Represented By Its Prop.Shaik Nazeer, S/o Shaik Syda, Shop No.20, Haji Gulamhussain Arcade, Opp:Zilla Parishad, Kurnool, Andhra Pradesh-518 001.
(CD 2) Sri. Shaik Nazeer, S/o.Shaik Syda, R/o H.No.40/468, Fisheries Compound, B.Camp, Kurnool,A.P. 518 002.
(CD 3) Sri. G. Madan Mohan, R/o Plot No.28, 28A, Mamatha Nagar, Venkat Ramana Colony, Hyderabad-500 024.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, **DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2)** in **OA/821/2018** an amount of **Rs.13,74,762.00 (Rupees Thirteen Lakhs Seventy Four Thousands Seven Hundred Sixty Two Only)** along with pendentellite and future interest @12.50% Simple Interest Yearly w.e.f. **10.04.2019** till realization and costs of Rs.**0/- (Only)** has become due against you (Jointly and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **01/01/2026 at 10:30 a.m**. for further proceedings.
5. In addition to the sum aforesaid, you will also be liable to pay: (a) Such interests as is payable for the period commencing immediately after this notice of the certificate/execution proceedings. (b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date: 06/11/2025
Recovery Officer
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 2)

ఉపాధ్యాయ, విద్యారంగ, సామాజిక ఉద్యమాల నేత నారాయణకు జోహార్లు

- టిపిటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ, విద్యారంగ, సామాజిక ఉద్యమాల నేత కె నారాయణకు టిపిటిఎఫ్ జోహార్లు తెలిపింది. క్యాన్సర్ సమస్యతో ఈ నెల 15న రాత్రి 11 గంటలకు నారాయణ మరణించిన సంగతి తెలిసిందే. ఆయన అంత్యక్రియలను నల్లగొండ్లలో నిర్వహించారు. ఈ మేరకు టిపిటిఎఫ్ అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్, ప్రధానకార్యదర్శి నన్నెబోయిన తిరుపతి ఒక ప్రకటన విడుదల చేశారు. "నారాయణ ప్రస్తుత రాజన్న సిరిసిల్లా జిల్లాలోని మారుమూల పల్లెటూరు ఓబులాపురంలో జన్మించారు. నారాయణ పంచాయితీరాజ్ ఉపాధ్యాయుల సమస్యల కోసం 1971లో పిఆర్‌టియు సంఘ వ్యవస్థాపనకు, కామన్ స్కూల్ విద్యావిధానం, శాస్త్రీయ విద్యా విధానం కొరకు జరుగుతున్న ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఉపాధ్యాయుల ప్రమోషన్‌లు, ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించడంలో క్రియాశీల పాత్ర పోషించారు. ఉద్యోగ విరమణ అనంతరం న్యాయవాదిగా న్యాయపోరాటం చేశారు. ఆయన మరణం ప్రజాస్వామిక ఉద్యమాలకు, విద్యారంగ ఉద్యమాలకు తీరని లోటు. నారాయణ మరణానికి సంతాపం. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి..." అని వారు తెలిపారు.

బిసిల రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి బిసి జెఎసి హెచ్చరిక
- బిజెపి ద్వంద్వ వైఖరిని వీడాలి : జాజుల శ్రీనివాస్ గౌడ్
- బషీర్ బాగ్ చౌరస్తా నుంచి ట్యాంక్ బండ్ వరకు రన్ ఫర్ సోషల్ జస్టిస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తొందరపడి బిసి రిజర్వేషన్లు పెంచకుండా ముందుకెళ్లితే బిసిల ఆగ్రహానికి గురికాక తప్పదని బిసి జెఎసి జెఎసి రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. నేడు జరిగే క్యాబినెట్ సమావేశంలో బిసి రిజర్వేషన్ల సాధనకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి, ఢిల్లీకి అఖిలపక్షం తీసుకువెళ్ళడానికి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిసి జెఎసి ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా బిసి జెఎసి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 'రన్ ఫర్ సోషల్ జస్టిస్' పేరుతో రన్‌కు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆదివారం హైదరాబాద్, బషీర్ బాగ్ చౌరస్తాలో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ట్యాంక్ బండ్ వద్ద గల డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు రన్ నిర్వహించారు. ఈ రన్‌లో బిసి ఉద్యమకారులతో పాటు మాజీ ఎంపి వి హనుమంతరావు, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, చీఫ్ కో-ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల పెంపు కోసం గత రెండు ఏళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం బాగా కృషి చేసిందన్నారు. బిసి రిజర్వేషన్లపై ఒక రాజకీయ కార్యాచరణ నిర్ణయించుకుని డిసెంబర్ 1వ తేదీ నుండి జరిగే పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం పోరాడాలని, ఇండియా కూటమి ద్వారా పార్లమెంటును స్తంభింప చేయాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో గెలిచామనే సాకుతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామంటే బిసిలను నమ్మించి మోసం చేయడమే అవుతుందన్నారు. ఇంకో 14 రోజులు ప్రభుత్వం ఓపిక పడితే పార్లమెంటు సమావేశాల్లో బిసి బిల్లును ఆమోదించని బిజెపిని బిసి సమాజం ముందు దోషిగా నిలబెట్టవచ్చునని అన్నారు. ఇప్పటికైనా బిజెపి ద్వంద్వ వైఖరి విడనాడాలన్నీరు. పార్లమెంటులో ఆమోదించకుంటే వేలాది మందితో చలో ఢిల్లీ నిర్వహించి పార్లమెంటును ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లు ఇప్పుడు అమలు కాకుంటే భవిష్యత్తులో ఇంకెప్పుడు అమలు జరిగే పరిస్థితి లేదన్నారు. వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికలు ఆగిపోతే కేంద్రం నుండి రావలసిన నిధులు రావడం లేదని చెబుతున్న ప్రభుత్వం లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.3,000 వేల కోట్లు ఆగిపోతే వచ్చే నష్టం ఎంతన్నారు. కేంద్రంతో కొట్లాడడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైతే, బిఆర్ఎస్ మద్దతుగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల బిసి నేతలు శ్రీనివాస్, వీరస్వామి, తాటికొండ విక్రమ్ గౌడ్, వేముల రామకృష్ణ, కనకాల శ్యామ్ కుర్మ, ఉప్పరి శేఖర్ సగర, దిటి మల్లయ్య, పిట్ల శ్రీధర్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, వరికుప్పల మధు, నిరంజన్, పాలకూరి కిరణ్ గౌడ్, మాదేశి రాజేందర్, తారకేశ్వరి, సంధ్యారాణి, గౌతమి, స్వామి గౌడ్, ఇంద్ర, మహేష్, భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల కష్టాలు పట్టించుకోండి

- మొద్దు నిద్రలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పట్టించుకోవాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. ఆరు గాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు అష్ట కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాలు మొద్దు నిద్రలో ఉన్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, ఎంపిలు ఈ అంశంలో మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. తేమశాతం, కపాస్ మొబైల్ యాప్ రిజిస్ట్రేషన్, జిన్నింగ్ మిల్లుల అవినీతి, మిల్లుల గ్రేడింగ్ అంటూ కుంటి సాకులతో సిసిఐ కొనుగోళ్లను నిరాకరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల్లో సిసిఐ కేవలం 1.12 లక్షల టన్నుల పత్తిని మాత్రమే కొనుగోలు చేసిందనీ, ఈ సీజన్‌లో అంచనా వేసిన 28.29 లక్షల టన్నుల ఉత్పత్తితో పోలిస్తే ఇది అత్యంత తక్కువని పేర్కొన్నారు. రాజకీయాలపైనే దృష్టి సారించకుండా, రాష్ట్రంలో నెలకొన్న పత్తి కొనుగోళ్ల సంక్షోభంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పత్తికి క్వింటాల్‌కు రూ. 8,110 కనీస మద్దతు ధర ఉండగా, సిసిఐ కొనుగోళ్ల లేక రైతులు అడ్డగోలు ధరకు ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్‌లో రూ. ఆరు వేల నుంచి రూ. ఏడు వేలు కూడా దక్కడం లేదని గుర్తు చేశారు. దీనివల్ల ప్రతి క్వింటాల్‌పై రైతులు దాదాపు రూ. 2,000 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ కొర్రీలకు తోడు జిన్నింగ్ మిల్లులు సమ్మె చేస్తే పత్తి రైతులు తీవ్రంగా నష్ట పోతారని కెటిఆర్ హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు

రైతులను నట్టేట ముంచుతున్న సర్కార్

- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పాలనలో రైతులను నట్టేట ముంచుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల పరిధిలోని మల్లారం గ్రామంలో గల వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా రైతులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. 85 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొంటామని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పటి వరకు కేవలం ఐదు, ఆరు లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు మాత్రమే కొన్నదన్నారు. కొన్న వాటికి కూడా బిల్లులు సరిగా రావడం లేదన్నారు. వెంటనే వడ్ల కొనుగోలును వేగవంతం చేయాలన్నారు. బోనస్ డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మక్క రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి రైతుల పరిస్థితి కూడా అగమ్యగోచరంగా మారిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులతో మాట్లాడి.. త్వరితగతిన కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలా ధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మండల నాయకులు కాముని ఉమేష్, పాపయ్య, కనకరాజు, సదానందం,ఆంజనేయులు రైతులు తదితరులు ఉన్నారు.

బుద్ధవనం పవిత్రమైన ప్రదేశం

- ఆర్‌పిఐ జాతీయ అధ్యక్షులు భీమ్‌రావు యశ్వంత్



భీమ్‌రావు యశ్వంత్‌కి బుద్ధజ్యోతిని అందజేస్తున్న రవిచంద్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బుద్ధవనం బౌద్ధ భిక్షువులకు, అభిమానులకు ఎంతో పవిత్రమైన ప్రదేశమని ఆర్‌పిఐ జాతీయ అధ్యక్షులు భీమ్‌రావు యశ్వంత్ అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని ఆదివారం భీమ్‌రావు యశ్వంత్ సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లాలోని నాగార్జునసాగర్ విజయపురిసౌత్‌లో మాలల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. సాగర్ సందర్శనలో భాగంగా బుద్ధవనంలో బుద్ధచరిత వనంలోని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. బుద్ధవనంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను తెలిపే లఘుచిత్రాన్ని వీక్షించారు. బుద్ధ విగ్రహం వద్ద బుద్ధజ్యోతిని వీరికి బుద్ధ వనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర అందించారు. సన్మానం చేసి మెమెంటోలు, బ్రోచర్లను బహూకరించారు. ఈ సందర్భంగా భీమ్‌రావు యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జునసాగర్‌లో బుద్ధవనాన్ని మహా అద్భుతంగా నిర్మించిందన్నారు. కార్యక్రమంలో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు దేవిప్రసాద్, కెప్టెన్ ప్రవీణ్ నికాడే, మేజర్ చంద్రకాంత్, లక్ష్మయ్య, సమతా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ కౌన్సిల్ స్వచ్ఛందంగా పని చేయాలి

- సీనియర్ సంపాదకులు దేవులపల్లి అమర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మీడియా స్వేచ్ఛతోపాటు మీడియాను అదుపు చేసేందుకు ప్రభుత్వ ఆజమాయిషీ లేని ప్రెస్‌కౌన్సిల్ లాంటి వ్యవస్థలు అవసరమని సీనియర్ సంపాదకులు దేవులపల్లి అమర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్, నాంపల్లిలోని మీడియా అకాడమి ఆడిటోరియంలో సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ మీడియా అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని (నేషనల్ ప్రెస్ డే) పురస్కరించుకుని 'అసత్య వార్తలు- మీడియా విశ్వసనీయత-రక్షణ'అనే అంశంపై సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ సమాజంలో మీడియా పేరుతో జరుగుతున్న దుష్ప్రయోగాలను ఎండ గట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. వర్కింగ్ జర్నలిస్టులు, వార్తా పత్రికలు, చట్టాలు ఎలా రూపొందించాలో ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సూచనమేరకు దేశంలో మొదటి ప్రెస్ కమిషన్‌తోపాటు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను 1966 నవంబర్ 16న ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అదే రోజునే జాతీయ పత్రికా దినోత్సవం నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని గుర్తు చేశారు. కొన్ని పత్రికలు, ఛానెల్స్ యాజమాన్యాలు మీడియా సంస్థలు నైతిక నియామావళిని పాటించడం లేదన్నారు. తప్పుడు వార్తలు ప్రచురించడం, ప్రసారం చేయడం వల్ల మీడియా మొత్తాన్ని దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని అరికట్టాలంటే మీడియా సంస్థలు, సంఘాలు అన్ని ఒక తాటిపై వచ్చి మనపై ఉన్న అభద్రతాభావాన్ని తొలగించాల్సిన అవసరముందన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణకు ప్రభుత్వం తరుపున తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యల కోణంలో మీడియా సంస్థలు పని చేయాలని ఆకాంక్షించారు. వార్త విశ్వసనీయత పరిశీలించి నిజాలను నిర్ధారణ చేసుకున్న తర్వాతే వార్తలు ప్రచురించాలని సూచించారు. వార్తల్లో వ్యక్తిగత అభిప్రాయాలను చొప్పించకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. వ్యక్తులు, రాజకీయ పార్టీలకు కొమ్ముకాయకుండా స్వతంత్రంగా మీడియా సంస్థలు వ్యవహరించాలని కోరారు.

అనుదినం జనస్వరం వినిపిస్తూ ప్రతి అక్షరం ప్రజల పక్షం ఉంటేనే ఆ సంస్థలకు మనుగడ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి సమాచార పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ డిఎస్. జగన్ అధ్యక్షత వహించారు. జర్నలిస్టుల సంఘాల ప్రతినిధులు మారుతి సాగర్, మాజీద్, రమణారావు, రంగసాయి, యూసుఫ్‌బాబు, రమణ కుమార్, సువర్ణ, తదితరులు నేషనల్ ప్రెస్ డే సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమానికి తమ సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ కె. వెంకట రమణ, మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, అధికారులు, జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

పంటపరిహారం కోసం ఎఇఒల వద్ద నమోదు చేయించుకోండి

- రైతులకు రైతు స్వరాజ్యవేదిక పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మొంథా తుపాన్‌లో పంట నష్టపోయిన రైతుల పేర్లు పరిహారం జాబితాలో నమోదు కాకపోతే తిరిగి ఎఇఒల వద్ద నమోదు చేయించుకోవాలని రైతు స్వరాజ్య వేదిక పిలుపునిచ్చింది. ఆదివారం ఈ మేరకు రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు కన్నెకంటి రవి, విస్సాకిరణ్, కొండల్ ఒక ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ చివర్లో మొంథా తుపాన్ వల్ల తీవ్ర పంట నష్టం (33 శాతం కంటే ఎక్కువ) జరిగిన రైతులు తమ పేర్లు నమోదు చేసుకుని జిల్లాల వారీగా సంఖ్యలు ప్రకటించిందనీ, రాష్ట్ర స్థాయిలో 1.17 లక్షల ఎకరాలు నష్టపోయినట్టు పేర్కొందని తెలిపారు. రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి పంట నష్టం నమోదులో జరుగుతున్న లోపాలను ఎత్తిచూపుతూ ప్రభుత్వానికి సూచనలు చేశామని తెలిపారు. పంట నష్టపోయిన రైతుల జాబితాను పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించాలనీ, పేర్లు నమోదు కాకపోతే రైతుల ఫిర్యాదు తీసుకుని మళ్లీ అంచనా వేయాలని మంత్రి ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. జాబితాలో పేర్లు లేని రైతులు ఏఈఓల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. 'జాతీయ విపత్తు నిర్వహణ చట్టం ప్రకారం "తీవ్ర పంట నష్టం" అంటే దిగుబడిలో 33 శాతం కంటే ఎక్కువ నష్టం కలగడం. అంటే వాతావరణం బాగుంటే సాధారణ దిగుబడి ఎకరానికి 10 క్వింటాళ్లు వస్తే ఇప్పుడు భారీ వర్షాలు, వరదల వల్ల దిగుబడి 6.5 క్వింటాళ్ల కంటే తక్కువ పడిపోవడం అంటే 33 శాతం పంట నష్టం జరిగినట్టే. అటువంటి పరిస్థితి ఉంటే రైతులు తప్పక ఏఈఓ దృష్టికి తీసుకెళ్లాలి' అని రైతులకు విన్నవించారు. పంచాయతీలకు దూరంగా ఉన్న తండాలు, గూడాలలో పంట నష్ట గుర్తింపు సర్వే జరగలేదనీ, ఆ ప్రాంతాల్లో మళ్లీ సర్వే చేసేలా అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ అబ్దుల్లా

సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలి

- ఆర్‌యుపిపిటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ (ఆర్ యుపిపిటి) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవేళ టెట్ తప్పనిసరైతే భాషోపాధ్యాయులకు ప్రత్యేకంగా పేపర్ 3 నిర్వహించాలని కోరారు. జిఒ 317 ద్వారా నష్టపోయిన భాషోపాధ్యాయులకు అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

రాష్ట్రగీత రచయిత ప్రముఖ కవి అందెశ్రీకి శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ, ఉపాధ్యక్షులు ఎస్ లక్ష్మీనారాయణ, కోశాధికారి ఎన్ భిక్షపతి, సలహాదారు లక్ష్మణ్ గౌడ్, రాష్ట్ర బాధ్యులు పద్మజారాణి, ఎస్ అరుణోదయ, షాబీర్, జహంగీర్, నసీరుద్దీన్, విష్ణుమూర్తి, జాన్ షాహెదా వివిధ జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసించండి

- 26న జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు
- పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న టి సాగర్, పాలడుగు భాస్కర్, వెంకట్రాములు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసనగా ఈ నెల 26న జిల్లా కేంద్రాల్లో ప్రదర్శన, ధర్నాలను నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి సాగర్, పాలడుగు భాస్కర్, ఆర్ వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9.12.2021న కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడింపు ద్వారా వచ్చిన మిగులును రైతులకు పంచాలని డిమాండ్ చేశారు.

కనీస మద్దతు ధరల చట్టం (సి2050) ప్రకారం కొనుగోలుకు గ్యారెంటీ చేయాలని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు సమగ్ర రుణ మాఫీ పథకాన్ని ప్రకటించాలన్నారు. రైతులకు వడ్డీ లేని రుణ పథకాన్ని అమలు చేయడానికి ఆర్‌బిఐ మిగులును నాబార్డ్‌కి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయొద్దనీ, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దనీ, విద్యుత్ బిల్లు - 2025ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గృహవినియోగ దారులందరికీ నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. రైతులు, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని కోరారు. అన్ని విపత్తు ప్రభావిత రాష్ట్రాలకు రూ.లక్ష కోట్ల పరిహారం ఇవ్వాలని, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు పరిహారం ఇవ్వాలని కోరారు. నిజమైన నష్టాలకు పరిహారం తప్పనిసరి చేయడానికి భౌతిక సర్వే చేయించాలని సూచించారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచాలనీ, ఈ పథకం ద్వారా 200 రోజుల పని, రోజు కూలీ రూ.700 ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలనీ, క్యాజువల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలనీ, నియామకాలపై నిషేధాన్ని వెంటనే ఎత్తేయాలని కోరారు. ప్రభుత్వ, ప్రభుత్వ రంగం సంస్థల్లో ఖాళీగా ఉన్న 65 లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలనీ, రిజర్వేషన్లను కాపాడటానికి ప్రయివేటీకరణను ఆపాలని, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలకు సామాజిక రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనీ, కనీస వేతనాల హక్కును రక్షించాలనీ, సహజ వనరులపై గిరిజన హక్కులను కాపాడటానికి అటవీ హక్కుల చట్టం, పెసా (గిరిజన ప్రాంతాలలో పంచాయతీల విస్తరణ చట్టం) చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలో ఎల్ఐసీ వంటి కార్పొరేట్ సంస్థల ద్వారా పంటలు, పశువుల కోసం బీమాను నిర్వహించే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర బడ్జెట్‌లో తగ్గించిన రూ.87వేల కోట్ల ఎరువుల సబ్సిడీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

కెప్టెన్ ఇంట్లో నేపాలి ముఠా భారీ చోరీ

- యజమానిపైనే దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని కార్ఖాన పిఎస్ పరిధిలో భారీ చోరీ జరిగింది. యజమాని ఇంట్లోనే నేపాలీ ముఠా దాడికి పాల్పడింది. దాదాపు రూ. 50 లక్షల విలువైన బంగారు నగలు, కొత్త నగదును అపహరించుకొని పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్‌రాక్ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉండే కెప్టెన్ గిరి ఇంట్లో గత రెండేళ్లుగా నేపాలికి చెందిన దంపతులు రాజేంద్ర సాహి (రాజు) అతడి భార్య పూజ పని చేస్తున్నారు. పక్కా ప్రణాళికతో దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. యజమాని భార్య పంజాగుట్టలోని బంధువుల ఇంటికి వెళ్లడంతో వారి ప్లాన్‌ను పక్కాగా అమలు చేశారు. సినీ ఫక్కీ తరహాలో యజమాని గిరి నిద్రిస్తున్న సమయంలో నేపాలీ దంపతులు రాజు, పూజతో పాటు మరో నలుగురు కలిసి యజమానిని తాళ్లతో చేతులు, కాళ్లు కట్టేశారు. మత్తు మందు తాగించడానికి ప్రయత్నించగా ఆయన అడ్డుకున్నారు. ఇంట్లో ఉన్న 25 తులాల బంగారం, రూ. 23 లక్షల నగదుతో పాటు గిరి ఒంటిపై ఉన్న బంగారం దోచుకున్నారు. కార్ఖానా పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైమ్ టీమ్‌లతో సిసి కెమెరాలు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

నేపాలి ముఠాను త్వరలో పట్టుకుంటాం :ఎసిపి రమేష్

దొంగతనంపై కార్ఖానా ఎసిపి రమేష్ స్పందిస్తూ నేపాలి దొంగల ముఠాను త్వరగా పట్టుకుంటామని తెలిపారు. దొంగతనం సమయంలో ఇంట్లో యజమాని ఒక్కడే ఉన్నాడని తెలిపారు.యజమాని భార్య పంజాగుట్టలోని బంధువుల ఇంటికి వెళ్లిందని అన్నారు. పక్కింటి వాళ్ల సహాయంతో గిరి పోలీసులను సంప్రదించాడని తెలిపారు. కేసు నమోదు చేసి ఆరు బృందాలతో గాలింపు చేస్తున్నామని తెలిపారు. ఇంట్లో పని చేస్తున్న మరో మహిళకు మత్తు మందు ఇవ్వడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిందని ఏసీపీ తెలిపారు.

కిసాన్ కపాస్ పేరుతో పత్తి రైతును దోపిడీ

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎమ్‌డి జహంగీర్

ఫొటో: గ్రామీణ సర్వేలో మాట్లాడుతున్న ఎమ్‌డి జహంగీర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేయాలని కిసాన్ కపాస్ పేరుతో పత్తి రైతును నిలువునా దోచుకునే నిర్ణయాన్నివెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలపరిధిలోని పులిగిల్ల గ్రామంలో నిర్వహించిన గ్రామీణ సర్వేలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎకరానికి కేవలం ఏడు క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాలని నిబంధన విధించడం వల్ల దేశంలో 50 లక్షల మంది రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా క్వింటా పత్తికి రూ.8,100 నిర్ణయించగా దళారులు రూ.5,500 నుండి రూ.6,500 వరకు ఇచ్చి దోచుకుంటున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దళారులను ప్రోత్సహించడం లాంటిదని, వారికి లాభం చేకూర్చే విధంగా ఉందన్నారు. పత్తి రైతులకు నష్టం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జిన్నింగ్ మిల్లుల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. పులిగిల్ల నుండి కేర్చిపల్లి వరకు వెళ్లేందుకు గల బీటీరోడ్డు అధ్వానంగా మారి ప్రజలను ఇబ్బందుల గురి చేస్తుందని, వెంటనే బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పల్లె దవాఖానకు నూతన భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, గణపతిరెడ్డి, మాజీ సర్పంచ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి, సిపిఎం మండలకార్యదర్శి వర్గ సభ్యులు వాకిటి వెంకటరెడ్డి, శాఖ కార్యదర్శి మారబోయిన నరసింహ, మండల కమిటీ సభ్యులు కవిడే సురేష్, శాఖ సహాయ కార్యదర్శి వేముల నాగరాజు, సీనియర్ నాయకులు దొడ్డి భిక్షపతి, వరికుప్పల యాదయ్య, వేముల చంద్రయ్య, కోమ్మిడి సత్తిరెడ్డి, వేముల జ్యోతి బాబు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నారాయణకు పట్ల టిఆర్‌టిఎఫ్ నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రగతిశీల ఉపాధ్యాయ నేత కెనారాయణ మరణం పట్ల టిఆర్‌టిఎఫ్ సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆదివారం తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ నాయకులు కటకం రమేష్, మారెడ్డి అంజిరెడ్డి నారాయణ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జీవితమంతా ఉపాధ్యాయ సంక్షేమం కోసం పాటుపడ్డారని గుర్తుచేశారు. ఉద్యోగ విరమణ తదనంతరం న్యాయవాదిగా పేదల పక్షాన నిస్వార్థంగా సేవలందించారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడం తమ సంకల్పమని తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన బస్సు

- అక్కడికక్కడే ఇద్దరు మృతి
- పలువురికి గాయాలు, మరో ఇద్దరు పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ రహదారిపై మరో విషాదకర రోడ్డు ప్రమాదం జరిగింది. జనగామ జిల్లా వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.... జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ సమీపంలో వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఇసుక లారీ ఆగివుంది. ఈ క్రమంలో వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ఆర్‌టిసి రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్ ఆగి ఉన్న ఇసుక లారీని అతివేగంగా ఢీకొట్టింది. దీంతో బస్సులో ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

వారిని జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజిఎంకు తరలించారు. అందులో విషమంగా ఉన్న ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

మతులు దుండిగల్‌కు చెందిన పూలమాటి ఓం ప్రకాష్ (75), హనుమకొండకు చెందిన నవదీప్ సింగ్ (52)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆస్పత్రి ప్రాంగణం మతుల కుటుంబ సభ్యుల రోదనతో కన్నీటిపర్యంతంగా మారింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జనగామ పోలీసులు తెలిపారు.